పెళ్లి వేడుకలకు వెళ్లి తిరిగొస్తుండగా..

- సింగరాజుపల్లి టోల్ గేట్ సమీపంలో రోడ్డు ప్రమాదం
- ఎదురెదురుగా ఢీకొన్న రెండు కార్లు
- ఒకరి మృతి.. ముగ్గురికి తీవ్రగాయాలు

ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కార్లు

దేవరుప్పుల, ఏప్రిల్ 4 : పెళ్లి వేడుకలకు వెళ్లి తిరిగొస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి టోల్ గేటుకు ఫర్లాంగ్ దూరంలో జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం జరిగింది. హైదరాబాద్ నారపల్లికి చెందిన ఏడుగురు మిత్రులు తమ ఎర్టిగా వాహనంలో సూర్యాపేట జిల్లా తిర్మలగిరిలో వివాహ వేడుకకు హాజరై తిరుగు ప్రయాణమయ్యారు. అదే సమయంలో దేవరుప్పులకు చెందిన ఓ కారులో మరో ఐదుగురు జనగామలో ఓ వివాహ వేడుకకు హాజరై తిరిగి వస్తున్నారు. కాగా, ఈ రెండు కార్లు సింగరాజుపల్లి టోల్ గేట్ సమీపంలో ఎదురెదురుగా అతివేగంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నారపల్లికి చెందిన కారు డ్రైవర్ స్థానంలో ఉన్న గ్యార సాయికుమార్(27) అక్కడికక్కడే మృతి చెందాడు. అదే వాహనంలోని బండ్లగూడకు చెందిన ప్రవీణ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే, దేవరుప్పులకు చెందిన కారులో డ్రైవర్ దాసగోని రంజిత్‌తోపాటు పాలకుర్తి మండలం చెన్నూరుకు చెందిన మహ్మద్ పాషాకు తీవ్రగాయాలయ్యాయి. ఈ కారులో వీరితోపాటు దేవరుప్పులకు చెందిన శివ, సాయి, అజయ్, ప్రశాంత్ కూడా ఉన్నారు. తీవ్రగాయాలైన వారిని వెంటనే 108 వాహనంలో జనగామ ఏరియా దవాఖానకు తరలించారు. మిగిలిన వారికి స్వల్ప గాయాలు కాగా ప్రాథమిక చికిత్స అందించారు.

మృతుడు గ్యార సాయికుమార్

విద్యార్థులతో ఏబీవీ కళాశాల అధ్యాపకులు

రాష్ట్ర స్థాయి పోటీల్లో ఏబీవీ విద్యార్థుల ప్రతిభ

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 4 : హైదరాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీల్లో జనగామ ప్రభుత్వ ఏబీవీ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ నర్సయ్య తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం విభాగాల్లో 'మా డిగ్రీ తెలుగు పాఠాలు–మా జీవితపు వెలుగు బావుటాలు', ఏ బ్రీఫ్ స్టడీ ఆఫ్ ద సెలెక్టెడ్ నావెల్స్ ట్రాన్స్ లేటెడ్ ఫ్రమ్ తెలుగు టూ ఇంగ్లిష్, యాన్ ఇన్వెస్టిగేషన్ ఫిన్స్‌లార్ జామెట్రీ అండ్ ఇట్స్ అప్లికేషన్స్' అంశాలపై విద్యార్థులు ఉత్తమ ప్రాజెక్టుపే ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ప్రాజెక్టు సూపర్‌వైజర్లు శైలజ, రాజేశ్ కుమార్, సంధ్యారాణి, ఏవో సులేమాన్, వెంకట్‌రెడ్డి, కల్యాణి పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా లక్ష్మి

పొర్రెడ్డి లక్ష్మి

అమ్రాజ్ భాగ్యలక్ష్మి

రఘునాథపల్లి/బచ్చన్నపేట,ఏప్రిల్ 4 : మహిళా కాంగ్రెస్ జనగామ జిల్లా కార్యదర్శిగా రఘునాథపల్లికి చెందిన పొర్రెడ్డి లక్ష్మిని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ తనపై నమ్మకంతో కార్యదర్శిగా నియమించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, మహిళా కాంగ్రెస్ బచ్చన్నపేట మండల అధ్యక్షురాలిగా లింగంపల్లికి చెందిన సీనియర్ నాయకురాలు అమ్రాజ్ భాగ్యలక్ష్మిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కొనుగోలు కేంద్రాల్లోనే గిట్టుబాటు ధర

- డీఏవో వినోద్‌కుమార్
- జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో ప్రారంభం

బచ్చన్నపేట : ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న డీఏవో వినోద్‌కుమార్

బచ్చన్నపేట/రఘునాథపల్లి/దేవరుప్పుల/జఫర్‌గఢ్/పాలకుర్తి రూరల్/నర్మెట, ఏప్రిల్ 4 : రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకే గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు డీఏవో, మండల ప్రత్యేకాధికారి వినోద్‌కుమార్, తహసీల్దార్ విశాలాక్షి, ఏపీఎం కొత్తపల్లి నాగేశ్వర్‌రావు, ఎంపీడీవో రఘురామకృష్ణ అన్నారు. గురువారం బచ్చన్నపేట మండలంలోని పోచన్నపేట, నారాయణపూర్, బచ్చన్నపేట, బసిరెడ్డిపల్లి, సాల్వాపూర్, కేశిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళారులు బెడద లేకుండా నేరుగా నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాల్లో విక్రయించే వీలు కల్పించినట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో విద్యాకర్‌రెడ్డి, ఏఈవో కరుణాకర్, కొడవటూరు దేవస్థాన కమిటీ చైర్మన్ గాలి కృష్ణ, సీసీలు నర్సింహులు, తిరుమల, సత్యనారాయణ, విజయలక్ష్మి, వీవోఏలు యాదలక్ష్మి, కవిత, రమ, ధనలక్ష్మి, మల్లేశం, కవిత, దీపిక, దస్తగిరి, హరిప్రసాద్, యాకంరెడ్డి, గాలి తిరుపతి పాల్గొన్నారు. జఫర్‌గఢ్ మండలంలోని తమ్మడపల్లి(జి), తీగారంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్ వెంకన్న ప్రారంభించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ హరిప్రసాద్, ఆర్ఐ అనిల్ బాబు, ఐకేపీ ఏపీఎం సురేందర్, పంచాయతీ సెక్రటరీ హరీశ్, ఏఈవో ప్రశాంత్, సీసీ సహదేవ్, వీవోఏ రజిత పాల్గొన్నారు. పాలకుర్తి మండలంలోని దుబ్బతండా ఎస్సీలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కోనుగోలు కేంద్రాన్ని డీఆర్‌డీవో మొగిలప్ప ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రంలో అమ్మ ఆదర్శ కమిటీల సమావేశాన్ని మండల నోడల్ అధికారి పోతుగంటి నర్సయ్య అధ్యక్షతన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆవుల రాములు, ఆర్‌అండ్‌బీ డీఈఈ జీవన్‌కుమార్, సీసీ కారుపోతుల వెంకటేశ్వర్లు, వీవోఏ గుగులోత్ విజయ, వినోద, రైతులు బన్సీ రాజు వీరన్న పాల్గొన్నారు. అలాగే, రఘునాథపల్లి మండలంలోని గోవర్ధనగిరిలో తహసీల్దార్ యుగేందర్, ఏపీఎం సారయ్య ప్రారంభించారు. సీసీలు రీనవతి, సంపత్, భాగ్యలక్ష్మి, ఎల్లస్వామి, సరోజన, ఉమాదేవి, మహిళా సంఘాల అధ్యక్షురాలు రాధిక, ఇందిర, పూల, వీవోలు రమ, పుష్ప, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. దేవరుప్పుల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో కడవెండి, పెదమడూరు, చౌడూరు, చినమడూరు, మాదాపురం, పెదతండాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను కడవెండి పీఏసీఎస్ వైస్‌చైర్మన్ నక్క రమేశ్ ప్రారంభించారు. సీఈవో కృష్ణమూర్తి, చినమడూరు డైరెక్టర్ ముసిగుంపుల కృష్ణమూర్తి, శ్రీధర్ పాల్గొన్నారు. నర్మెట మండలంలోని మల్కపేట, మచ్చుపహాడ్, అమ్మాపురం, వెల్దండ గ్రామాల్లో గ్రామైక్య సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏపీఎం మదారపు రవి ప్రారంభించారు. కార్యక్రమంలో సీసీలు కవిత, యాదగిరి, కుమార్, ఆర్ఐ సాయిబాబా, సీఏలు పాల్గొన్నారు.

దేవరుప్పుల : కడవెండిలో ధాన్యం కొనుగోలును ప్రారంభిస్తున్న పీఏసీఎస్ వైస్ చైర్మన్ నక్క రమేశ్

సిరిపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీపీఎం అనిల్, అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస్

గోనె సంచులు అందిస్తాం

'నమస్తే' కథనానికి స్పందన

లింగాలఘనపురం, ఏప్రిల్ 4 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచులను అందిస్తామని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అనిల్, అదనపు డీఆర్డీవో శ్రీనివాస్ తెలిపారు. మండలంలో ఒక్క నాగారంలోనే గత నెలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఎస్‌వో రోజారాణి ప్రారంభించారు. అయితే, ఇక్కడ వేయింగ్ మిషన్లు, గోనె సంచులను సరఫరా చేయక పోవడంతో పాటు ఇతర గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. దీంతో నమస్తే తెలంగాణ దినపత్రికలో గురువారం 'సంచులు లేవు... కాంటాలు కావు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన డీపీఎం, అదనపు డీఆర్డీవో నాగారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. వడ్ల తేమను పరిశీలించి కొనుగోలుకు సిద్ధంగా ఉన్నట్లు అంగీకరించారు. ఒక్కరోజు వ్యవధిలో గోనె సంచీలను సరఫరా చేస్తామని, రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలని సూచించారు. అలాగే, మండలంలోని అన్ని గ్రామాల్లో హుటాహుటిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సిరిపురంలో శ్రీనివాస్, అనిల్, నవాబుపేటలో జనగామ ఆర్డీవో కొమురయ్య, చీటూరులో తహసీల్దార్ వినయలత, కొత్తపెల్లిలో ఎంపీడీవో జలంధర్‌రెడ్డి, వనపర్తి, నేలపోగుల, నెల్లుట్లలో మండల స్పెషలాఫీసర్ లత కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఏపీఎం శంకరయ్య, ఆర్ఐ కిశోర్, సీసీలు శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, మల్లేశం, ఏఈవో శ్రీనివాస్, వీవోఏలు బాబు, రేఖ, ఊర్మిళ, భవాని, స్వరూప, ప్రణీత, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మాదిగల ద్రోహి

- రేవంత్‌రెడ్డి వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్

కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా జనగామలో నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 4 : కాంగ్రెస్ పార్టీ మాదిగల ద్రోహి అని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ తీవ్రంగా విమర్శించారు. గురువారం జనగామ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉపేందర్ హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో 70 లక్షలకు పైగా ఉన్న మాదిగలకు నాగర్‌కర్నూల్, పెద్దపల్లి, వరంగల్ వంటి మూడు పార్లమెంట్ ఎస్సీ రిజర్వ్ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అవకాశం కల్పించకపోవడం దారుణమన్నారు. రేవంత్‌రెడ్డి తన సీఎం సీటును కాపాడుకోవడం కోసం మాలలతో కుమ్మక్కై మాదిగలను నట్టేట ముంచారని ఆరోపించారు. 17 పార్లమెంట్ స్థానాల్లో 4 శాతంలేని రెడ్లకు 6 స్థానాలు, 50శాతానికిపైగా ఉన్న బీసీలకు 2 స్థానాలు, 12 శాతానికి పైగా ఉన్న మాదిగలకు అసలు స్థానమే లేకుండా కాంగ్రెస్ ద్రోహం చేసిందన్నారు. పదవుల కోసం కండువాలు మార్చే రాజకీయ అవకాశవాది కడియం శ్రీహరికి ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని రెండు పార్లమెంట్ స్థానాల్లో మాదిగలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మాదిగలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఎంపీ స్థానాల్లో మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించని కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి వైఖరికి నిరసనగా 10రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పైసా రాజశేఖర్, బొట్ల మహేశ్, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు కిశోర్, రాష్ట్ర నాయకులు చుంచు రాజు, సందెన రవీందర్, కుమార్, ఉదయ్ కిరణ్, నిర్మలా భాస్కర్, గువ్వల రవి, శ్యాంసన్, శ్రీనివాస్, నాగరాజు, ఆదాం, చరణ్, అనిల్, మహేందర్, నవీన్, అశోక్, అంజయ్య, ఆనందం, రాము పాల్గొన్నారు.

జనగామ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన అంకిత్ కుమార్

బాధ్యతలు స్వీకరిస్తున్న అంకిత్‌కుమార్ శంక్వార్

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 4 : జనగామ ఏసీపీగా గురువారం ఐపీఎస్ అధికారి అంకిత్ కుమార్ శంక్వార్ బాధ్యతలు స్వీకరించారు. గ్రేహౌండ్స్ విభాగంలో అసాల్ట్ కమాండర్‌గా విధులు నిర్వర్తిస్తున్న అంకిత్ కుమార్‌ను పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు అటాచ్ చేసి, జనగామ ఏసీపీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విధుల్లో చేరిన ఏసీపీ అంకిత్ కుమార్‌ను పలువురు పోలీసు అధికారులతో పాటు సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ దవాఖానలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారి

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

పాలకుర్తి రూరల్, ఏప్రిల్ 4 : వేసవిలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి బీ రవిరాథోడ్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో తహసీల్దార్ టీ వెంకటేశం, ఎంపీడీవో ఆవుల రాములు, ఎస్సై మోడెం సాయి ప్రసన్నకుమార్ గౌడ్‌తో కలిసి వడదెబ్బ విషయంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలో బయట తిరుగొద్దన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు స్ఫూర్తి, స్పందన, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

గాయపడిన పూజారి శ్రీను

పాలకుర్తి, ఏప్రిల్ 4 : తాటి చెట్టు పైనుంచి గీత కార్మికుడు కింద పడటంతో తీవ్ర గాయాలైన ఘటన మండలంలో గూడూరులో గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం..గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు పూజారి శ్రీను రోజువారి వృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. దీంతో అతడి తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వరంగల్ దవాఖానకు తరలించారు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని గౌడజన హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల వెంకటేశ్వర్లుగౌడ్ కోరారు.

ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 4 : జనగామలోని ధర్మకంచ జడ్పీ హైస్కూల్ ఆవరణలో కొత్తగా గురువారం ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆధార్ నమోదు కేంద్రాల జిల్లా కోఆర్డినేటర్ మోహన్ నాయక్, హెచ్ఎం శ్రీనివాస్ తెలిపారు. ఆధార్ కార్డులో తప్పొప్పులు సరి చేసుకోవడానికి సంప్రదించాలని పేర్కొన్నారు. వివరాలకు 99129 77504, 81799 35749 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సతీశ్, ఆపరేటర్ దుర్గా పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌కు నిస్వార్థ ఫౌండేషన్ ఆర్థిక సాయం

నర్మెట, ఏప్రిల్ 4 : మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌కు నిస్వార్థ ఫౌండేషన్ రూ.73,064 ఆర్థిక సాయం అందజేసింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన పూర్వ విద్యార్థులు సాఫ్ట్‌వేర్ రంగంలో రాణిస్తూ ఈ ఫౌండేషన్ స్థాపించారు. మోడల్ స్కూల్‌లో వర్షాల కారణంగా విద్యుత్ వ్యవస్థ దెబ్బతినడంతో విద్యార్థుల ద్వారా విషయాన్ని తెలుసుకున్న ఫౌండేషన్ ప్రతినిధులు విద్యుత్ పునరుద్ధరణకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేశారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టీ శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

రఘునాథపల్లి ఏప్రిల్ 4 : నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్ తెలిపారు. మండలంలోని కుర్చపల్లి గ్రామానికి చెందిన దేవసాని శ్రీహరి ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్నాడనే పక్క సమచారం మేరకు తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మద్యం బాటిళ్లను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకొని అతడిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

స్వాధీనం చేసుకున్న మద్యంను చూపుతున్న ఎస్సై నరేశ్

నీటి కుంటలో పడి ఒకరి మృతి

కుంటలో పడి మృతి చెందిన కనుకయ్య

బచ్చన్నపేట, ఏప్రిల్ 4 : నీటి కుంటలో పడి ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలోని కట్కూర్‌లో జరిగింది. ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుజ్జుల కనకయ్య(55) బుధవారం సాయంత్రం వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో సమీపంలోని నీటి కుంటలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోయే సరికి కుటుంబ సభ్యులు బావి వద్దకు వెళ్లి చూసినా కన్పించలేదు. గురువారం ఉదయం మళ్లీ వెళ్లి చూడగా కుంటలో చెప్పు తేలి ఉండడం గమనించి అనుమానంతో నీటిని తోడి చూడగా అతడి మృతదేహం లభ్యమైంది. మృతుడికి ఫిట్స్ వచ్చేదని దాని కారణంగానే కుంటలో పడి మృతిచెంది ఉంటాడని గ్రామస్తులు తెలిపారు. కనకయ్యకు భార్య రమాదేవి, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మృతుడి కుమారుడు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బ్లూకోల్ట్స్ సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలి : సీపీ

సుబేదారి, ఏప్రిల్ 4 : బ్లూకోల్ట్స్ సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని వరంగల్ సీపీ అంబర్‌కిశోర్‌ఝా అన్నారు. గురువారం హనుమకొండలోని వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో బ్లూకోల్ట్స్ సిబ్బంది, ఎస్సైలతో సమావేశం నిర్వహించారు. బ్లూకోల్ట్స్ సిబ్బంది విధులపై సీపీ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఫిర్యాదులపై బ్లూకోల్ట్స్ సిబ్బంది క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేసి రిపోర్ట్‌ను స్టేషన్ అందజేయాలన్నారు.అదనపు డీసీపీ రవి, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, సీఐలు సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నీటి ఎద్దడిని నివారించాలి

సీపీఎం మండల కమిటీ సభ్యుడు రామగళ్ల అశోక్

బచ్చన్నపేట, ఏప్రిల్ 4 : మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు తాగునీటి ఎద్దడి ఎదుర్కోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సీపీఎం మండల కమిటీ సభ్యుడు రామగళ్ల అశోక్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మండలంలోని చిన్నరామన్ చర్లలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. వేసవి ప్రారంభంలోనే గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో ప్రైవేటు వాటర్‌ప్లాంట్ల యజమానులు అధిక ధరలకు నీటిని విక్రయిస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ల ను నివారించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మిషన్ భగీరథ నీరు రోజూ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, మండలంలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు స్పందించి, సమస్యలను పరిష్కరించాలన్నారు. నాయకులు సుధాకర్, మనోహర్, బాల్‌నర్సయ్య, భిక్షపతి, రవి, కనకయ్య పాల్గొన్నారు.

మే 14 నుంచి పోతన విజ్ఞాన పీఠంలో నాటక ప్రదర్శనలు

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 4 : మే 14 నుంచి 16 వరకు వరంగల్ పోతన విజ్ఞాన పీఠంలో నాటక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ తిరుమలయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్ఎస్ఆర్ మూర్తి తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రం నుంచి మూడు చొప్పున మొత్తం 6 నాటక ప్రదర్శనకు ఏర్పాట్లు చేసినట్లు, ప్రదర్శించిన ప్రతి నాటికకు రూ.15 వేలు పారితోషికం, పోటీల్లో గెలుపొందిన ఉత్తమ, ద్వితీయ నాటకాలకు రూ.10 వేలు, రూ.5వేలు చొప్పున జ్ఞాపికలతో సత్కరించనున్నట్లు తెలిపారు.

విగ్రహానికి ముసుగు వేసిన అధికారులను సస్పెండ్ చేయాలి

జనగామలో నిరసన వ్యక్తం చేస్తున్న దళిత, గిరిజన, బహుజన ప్రజా సంఘాల నాయకులు

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 4 : జనగామ జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద భారత మాజీ ఉపప్రధాని, సమతావాది బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఎన్నికల కోడ్ నెపంతో ముసుగు వేసి అవమానించిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి (సీఏపీఎస్ఎస్) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరిపోతుల పరశురాములు డిమాండ్ చేశారు. గురువారం జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద సీఏపీఎస్ఎస్, దళిత, గిరిజన, బహుజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పరశురాములు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపెడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహనీయులు బాబు జగ్జీవన్ రామ్, జ్యోతిరావు పూలే, అంబేద్కర్ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించకపోవడం దారుణమన్నారు. జగ్జీవన్ రామ్ విగ్రహానికి ముసుగు వేయాలని ఆదేశించిన జిల్లా ఎన్నికల అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జనగామలో మాత్రమే జగ్జీవన్ రామ్ విగ్రహానికి ముసుగు వేయడం శోచనీయమన్నారు. ఇదిలా ఉంటే జిల్లాలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలు అధికారికంగా నిర్వహిస్తున్నారా.. లేదా..? అని సమాచారం ఇచ్చేవారు కరువయ్యారని పలువురు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కోడ్ ఉన్నా కూడా మహనీయుల జయంతి ఉత్సవాలను నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి అధికారికంగా నిర్వహించిందని గుర్తు చేశారు. కేవలం కోడ్‌ను సాకుగా చూపెడుతూ మహనీయుల జయంతి ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహించకపోవడం దళిత, గిరిజన, బహుజన సమాజాన్ని అవమానించడమేనన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు నీలం భాస్కర్, జీ కృష్ణ, పరశురాములు, సతీశ్, నిఖిల్ గౌడ్, భిక్షపతి నాయక్, చొప్పరి శ్రీను, ఇస్తారి, బిక్కు నాయక్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఎర్రబెల్లి ఆశీర్వాదం

వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

పాలకుర్తి రూరల్, ఏప్రిల్ 4 : మండలంలోని బమ్మెర ఎంపీటీసీ బానోతు చత్రూ కుమారుడు రాజు–స్వాతి, మల్లంపల్లి మాజీ ఎంపీటీసీ తాళ్లపల్లి సైదులు కుమారుడు తాళ్లపల్లి రాజు–సంధ్య , వల్మిడి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మోకాటి ఎల్లయ్య కుమార్తె అరుంధతి వివాహ వేడుకలకు గురువారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట ఎంపీపీ నల్లా నాగిరెడ్డి,